నీరుగారిన లక్ష్యం

వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో కానరాని పిల్లల కార్యక్రమాలు



సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా



బీచ్ రోడ్డు: హార్ట్ ఆఫ్ ది సిటీ సిరిపురంలో నిర్మించిన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో చిన్నారుల కార్యక్రమాలు కానరావడం లేదు. పిల్లలకు వినోదం, విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో.. రూ.16 కోట్లతో ఆధునికీకరించిన ఈ బాలల ప్రపంచం పెద్దల ఈవెంట్లకే వేదికగా మారింది. పెళ్లి విందులు, సినిమా ఫంక్షన్లు, మతపరమైన కార్యక్రమాలు, ఇతర వేడుకలకు నిలయమైంది. ఎందుకోసమైతే ఈ ఆడిటోరియాన్ని నిర్మించారో.. ఆ లక్ష్యం పూర్తిగా నీరుగారింది. ఈ ఏడాదైనా చిన్నారుల కోసం వేసవి శిక్షణ తరగతులను అధికారులు నిర్వహిస్తారా అనే సందేహం నెలకొంది.

పెద్దల కార్యక్రమాలకే ప్రాధాన్యం

చిల్డ్రన్స్ ఎరీనాలో చిన్నారుల కోసం కాకుండా వీఎంఆర్‌డీఏ పెద్దల కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యమిచ్చింది. గడిచిన ఏడేళ్లలో సినిమా ఫంక్షన్లు, రాజకీయ సమావేశాలు, మతపరమైన కార్యక్రమాలు, విందులు వంటి వాటికి ఎరీనాను కేటాయించారు. వినోదం కాకపోయిన విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్లు వంటివి బాలల కోసం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ.16 కోట్లతో ఆధునికీకరణ

చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే, సమాజంపై బాధ్యతను పెంచే సినిమాల ప్రదర్శనతో పాటు విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడానికి సిరిపురంలో చిల్డ్రన్స్ ఎరీనాను వీఎంఆర్‌డీఏ నిర్మించింది. 2012లో దీని ఆధునికీకరణ ప్రారంభించారు. 2018 నాటికి రూ.16 కోట్లతో పనులు పూర్తి చేసి ఎరీనాను ఘనంగా ప్రారంభించారు. 600 సీట్లు, 4కే టెక్నాలజీతో థియేటర్‌ను రూపొందించారు. కింద ఫ్లోర్‌లో ఎగ్జిబిషన్ హాల్ నిర్మించారు. దేశంలోనే రెండో నిర్మాణంగా విశాఖ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా రికార్డుకెక్కింది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో చిన్నారుల కోసం చిత్రాల ప్రదర్శన, సైన్స్ ఎగ్జిబిషన్ల ఏర్పాటుపై తల్లిదండ్రుల నుంచి అనేక వినతులు వస్తున్నాయి. వీటిపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తరఫున వీఎంఆర్‌డీఏ కమిషనర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. బాలలకు వినోదం, విజ్ఞానం అందించేందుకు కృషి చేస్తాం.

– గొండు సీతారాం, సభ్యుడు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

ఏడేళ్లుగా నోచుకోని చిత్రాల ప్రదర్శనలు

ఈ ఆడిటోరియంలో గత ఏడేళ్లలో ఏడు చిత్రాలు కూడా ప్రదర్శించిన దాఖలాలు లేవు. 2018లో చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినా.. సాంకేతిక కారణాల వల్ల అది విజయవంతం కాలేదు. దాని తరువాత ఒక్క చిల్డ్రన్ ఫెస్టివల్ కూడా ఇక్కడ నిర్వహించ లేదు.



చిల్డ్రన్స్ థియేటర్

విజ్ఞాన ప్రదర్శనలు, వేసవి శిబిరాల ఊసే లేదు

సైన్స్ ఎగ్జిబిషన్ల ద్వారా చిన్నారులు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు చిల్డ్రన్స్ ఎరీనాను ఆధునికీకరించారు. ఆపై ఒక్క విజ్ఞాన ప్రదర్శన కూడా జరిగిన ఊసే లేదు. మొదట్లో ప్రైవేటు సంస్థలు అప్పుడప్పుడు విద్యార్థులకు పోటీలు నిర్వహించడం మినహా వీఎంఆర్‌డీఏ నుంచి ఎటువంటి సైన్స్ ఎగ్జిబిషన్లు లేవు. ఎరీనా ఆధునికీకరణ అనంతరం రెండేళ్ల పాటు చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించి ఆ తరువాత వాటికి స్వస్తి పలికారు. గడిచిన ఐదేళ్లలో సమ్మర్ క్యాంపుల జోలికి పోలేదు. దీంతో చిన్నారులు ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే వేసవి శిక్షణ తరగతుల్లో చేరేందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాదైన వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తారే అని తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



చిల్డ్రన్స్ ఎరీనాలో సైన్స్ ఎగ్జిబిషన్ హాల్

క్లుప్తంగా

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గో సేవ



గో వ్యర్థాలు తొలగిస్తున్న యువ సేవకులు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు సింహాచలం యువత ఆధ్వర్యంలో ఆదివారం గో సేవ కార్యక్రమం నిర్వహించారు. సింహాచలంలోని సింహాద్రి అప్పన్న గోశాలను శుభ్రం చేశారు. గో వ్యర్థాలను తొలగించి, ఆవులను సంరక్షించి, స్నానం చేయించడంతోపాటు మేతను అందజేశారు. సింహాద్రి అప్పన్న గోశాలకు సేవలందించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా యువత పేర్కొన్నారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో తరచూ గో సేవ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రయోజనకరంగా పరిశోధనలు



రక్షితకు డాక్టరేట్ అందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: పరిశోధనలు సమాజానికి మేలు చేసేలా యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు మరింత సాధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని టీకె జయరక్షితకు ఏయూ డాక్టరేట్ లభించింది. వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఏ హోలిస్టిక్ అనాలసిస్ ఆఫ్ బనానా ఫైబర్–రీన్ ఫోర్స్‌డ్ సస్టైనబుల్ కాంక్రీట్ ఆఫ్ ఎం 25, అండ్ ఎం 35' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయ రక్షితను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

15 ఏళ్ల తర్వాత.. ఇంటికి చేరిన సిద్ధయ్య



సిద్ధయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: సుమారు రెండేళ్ల క్రితం రైల్వే స్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో, అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న సిద్ధయ్య అనే మానసిక రోగిని ఏయూటీడీ సిబ్బంది రక్షించారు. అప్పటికే 13 ఏళ్లుగా ఒంటరిగా తిరుగుతూ వైజాగ్ చేరుకున్న అతనికి ఏయూటీడీ ఆశ్రయం కల్పించింది. కర్ణాటక రాష్ట్రం, తుమకూరు జిల్లాలోని బుక్కపట్నంకు చెందిన సిద్ధయ్య అక్కడ వ్యవసాయం చేస్తూ జీవనం గడిపేవాడు. అతని తల్లి కూడా మానసిక సమస్యలతో బాధపడేది. కొన్నాళ్లకు సిద్ధయ్యకు మానసిక వ్యాధి తీవ్రమైంది. దీంతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అలా విశాఖ చేరుకున్న సిద్ధయ్యను ఏయూటీడీ సిబ్బంది చేరదీసి, ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మెరుగైన చికిత్స అందించారు. అనంతరం అతన్ని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌కు తరలించారు. సిద్ధయ్య పూర్తిగా కోలుకున్నాడని నిర్ధారించుకున్న తర్వాత ఏయూటీడీ సిబ్బంది సిద్ధయ్య వివరాలు తెలుసుకుని అతని స్వగ్రామానికి తీసుకెళ్లారు. బుక్కపట్నంలో సోదరుడు రంగ రాజుకు క్షేమంగా అప్పగించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు చెప్పారు.

రక్తదాన శిబిరం

దాబాగార్డెన్స్: శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో ఆదివారం డాబా గార్డెన్స్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా ప్రతినిధి పైడి రజని మాట్లాడుతూ, రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. వారి స్నేహితులు పద్మ, అపూర్వ, శ్రావ్య, కిరిటీ, చంద్రమౌళి, నరేంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, రమణరాజు, ఉదయ్‌లతో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మొత్తం 25 యూనిట్ల రక్తాన్ని సేకరించగలిగామని ఆమె తెలిపారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



ఆరిలోవ లాడ్జీలో యువకుడి బ్యాగు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ కృష్ణ



రుషికొండ లాడ్జీలో యువకుడి ఆధార్ కార్డు పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాందాస్

ఆరిలోవ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసులు శనివారం అర్ధరాత్రి లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలన్నింటిలోనూ సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐలు కృష్ణ, రాందాస్, ఏఎస్‌ఐలు మూడు బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. శ్రీకాంత్‌నగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లోని 17 లాడ్జీలకు పోలీసులు వెళ్లి.. అక్కడ ఎంతమంది ఉన్నారు.. ఏయే రూంలలో ఉన్నారు.. అనే వివరాలను రిసెప్షన్ వద్ద సేకరించారు. అనంతరం గదుల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. వారి ఆధార్ కార్డులు పరిశీలించి, ఎక్కడి నుంచి వచ్చారు, ఏ పనులపై వచ్చారు, ఎప్పటి నుంచి లాడ్జీలో ఉంటున్నారు తదితర వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ కార్డు, వారి పూర్తి వివరాలు, అడ్రస్ తెలుసుకున్న తర్వాతే రూమ్‌లు ఇవ్వాలని లాడ్జీల యజమానులకు పోలీసులు సూచించారు.

కుప్పలుగా జీవీఎంసీ తుక్కు



ముడసర్లోవ సీవేజ్ ప్లాంట్ ఆవరణలో పాత వాహనాల భాగాలు



పాడైన డస్ట్ బిన్లు, ఇతర వ్యర్థాలు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద సీవేజ్ ప్లాంట్ ఆవరణ మామిడి తోటలో జీవీఎంసీకి చెందిన కాలం చెల్లిన వస్తువులను కుప్పలుగా వేశారు. ఏళ్ల తరబడి తుప్పుపట్టిన ఇనుము, ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి చేటుగా మారుతున్నాయి. కాలం చెల్లిన వాహనాలు, పారిశుధ్య పనులకు వినియోగించే డస్ట్ బిన్లు, డంపర్ బిన్లు, చెత్త సేకరించే తోపుడు బళ్లు, వాహనాల విడి భాగాలు, టైర్లు నిల్వ ఉంచారు. నగరంలోని అన్ని వార్డుల నుంచి వాటిని తీసుకొచ్చి ఇక్కడ వేయడంతో అవి కుప్పలుగా పడ్డాయి. ఇవి తుప్పు పట్టడంతో దుర్వాసన వస్తోంది. వర్షం కురిసినప్పుడు నీరు ఈ విడిభాగాల్లో నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీని వల్ల ప్లాంట్‌కు సమీపంలోని ఆరిలోవ కాలనీ, నలభై గజాల రోడ్డులో నివాసులకు దోమల బెడద పెరిగిపోతోంది. ఇదిలా ఉండగా.. మందుబాబులు ఇక్కడ నిల్వ ఉన్న తుప్పు పట్టిన విడిభాగాలను ఎవరి కంటా పడకుండా రాత్రిళ్లు ఎత్తుకుపోతున్నారు. చినగదిలి, శ్రీకాంత్‌నగర్, సుందరయ్య కాలనీ పరిసరాల్లో నిర్వహిస్తున్న తుక్కు గొడౌన్‌ల్లో విక్రయించేస్తున్నారు. ఇక్కడ పాడైన ఈ భాగాలను జీవీఎంసీ అధికారులు వేలం వేస్తే కొన్ని రూ.లక్షలు ఆదాయం లభించే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ చిన్నంనాయుడు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. మద్యం షాపుల వద్ద చిందులేసినా, గొడవలు చేసిన ఊరుకునేది లేదన్నారు. మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనలో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారి కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం బుజ్జి గణపతి నృత్యాంశంతో ప్రారంభమైంది. జై జనార్దన, ఐగిరి నందిని నృత్య రూపకాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద వంటి అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పవిత్ర, మోక్షజ్ఞాన, లక్ష్మీప్రణతి, జాస్మిక, గాతామిత్క తదితర కళాకారులు పాల్గొన్నారు. మురళీగోవింద్ నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఏవో రమణ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

మద్దిలపాలెం: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం ఎదురుగా గల ఫంక్షన్ హాల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. కంచరపాలెం బి.ఎస్.ఆర్.ఫౌండేషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ నాయకుడు శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు. రోజూ మనం ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ ఉన్న వాటితో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించి, పిల్లలకు నేర్పించారు. దీని కోసం కిట్ తయారు చేసి అందరికీ అందించారు. వీసీసీ ఫౌండర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ఈ వేసవిలో విద్యార్థులకు వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. యువతకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నివాస ప్రాంతాల్లో పిల్లల మధ్య స్నేహం, మొబైల్ నుంచి కొంత దూరంగా ఉండటం ఈ శిబిరాల్లో నేర్పిస్తున్నామన్నారు. సమ్మర్ క్యాంప్ నిర్వహణకు ముందుకొస్తే సహకారం అందిస్తామన్నారు. వివరాలకు 83098 12422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఓరిగామి, టీం గేమ్స్, మెమరీ గేమ్స్, ఓల్డ్ గేమ్స్, కమ్యూనికేషన్ గేమ్స్, పాటలు నేర్పిస్తున్నట్లు వివరించారు. జోన్ కన్వీనర్లు సరోజిని, మణి, హరిత, దేవితోపాటు మొత్తం 10 జోన్ల నుంచి చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



16వ వార్డులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో ప్రతిష్ఠించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆదివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మాజీ డైరెక్టర్ కనక సుందరరావు, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను ప్రత్యేక ఆహ్వానితులు బి.ఎస్.కృష్ణచైతన్య, కొల్లాబత్తుల సత్యం వివరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గొర్ల రమేష్, సెక్రటరీ కంచుమూర్తి నరసింగరావు, పాలకవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భీమిలి తీరంలో రంగుల తెప్పల సందడి



తీరానికి వస్తున్న రంగుల తెరచాప తెప్పలు

భీమునిపట్నం: భీమిలి తీరం ఆధునిక మత్స్యకార పడవలతో సందడిగా ఉన్నప్పటికీ, తెడ్ల సాయంతో తెప్పలపై చేపల వేట సాగించే మత్స్యకారులు ఇప్పటికీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. గతంలో పడవలు, తెప్పలు ప్రధాన వేట సాధనాలుగా ఉన్న సమయంలో, మత్స్యకారులు తెడ్ల సాయంతోనే సముద్రంలోకి వెళ్లి తిరిగి వచ్చేవారు. ఆ సంప్రదాయ ఆనవాళ్లు నేటికీ భీమిలి తీరంలో కనిపిస్తున్నాయి. యాంత్రిక బోట్లపై ప్రస్తుతం వేట నిషేధం అమల్లో ఉన్నప్పటికీ, తెప్పలతో వేటాడే వారికి ఈ నిబంధన వర్తించదు. దీంతో చాలా మంది మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం ఇప్పటికీ తెప్పలనే నమ్ముకున్నారు. ఒక్కో తెప్పకు ఒక్కో రంగు తెరచాప ఉండటం తీరానికి ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. సముద్రపు నీలి రంగు నేపథ్యంలో ఈ రంగుల తెరచాపలు కనువిందు చేస్తున్నాయి.

ఎన్నాళ్లీ.. దుర్గంధం!

- విమ్స్ గేటు వద్ద గెడ్డలో పేరుకుపోయిన పూడిక
- ఇబ్బంది పడుతున్న రోగులు, ఆస్పత్రి సిబ్బంది



విమ్స్ బీఆర్‌టీఎస్ గేటు వద్ద గెడ్డలో కుప్పలుగా పేరుకుపోయిన చెత్త

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) బీఆర్‌టీఎస్ రహదారి గేటు వద్ద గెడ్డలో చెత్త విపరీతంగా పేరుకుపోయింది. ఇక్కడి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు రహదారి నిర్మాణం కోసం జరుగుతున్న పనులు రోగులకు దుర్గంధాన్ని ఇస్తున్నాయి. విమ్స్ స్థలంలోనే ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ నిర్మించిన విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేకంగా రహదారి లేదు. దీంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన బీఆర్‌టీఎస్ నుంచి దీనికి రోడ్డు నిర్మిస్తున్నారు. దీని కోసం పోలీస్ స్టేషన్ ఎదురుగా గెడ్డపై వంతెన నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనుల్లో భాగంగా గెడ్డ నుంచి మురుగు నీరు కిందకు పోవడానికి సన్నని కాలువ మాదిరిగా తవ్వి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేశారు. ఇది చిన్న మార్గం కావడంతో నీరు కిందకు పోవడం లేదు. ఆరిలోవ కాలనీ, పెదగదిలి, చినగదిలి, తోటగరువు, బాలాజీనగర్ తదితర ప్రాంతాల ప్రజల వాడుక నీరు ఈ గెడ్డ నుంచి కిందకు ప్రవహిస్తుంది. ఆ నీటిలో చెత్త కూడా కిందకు వెళ్లే మార్గం ఇక్కడ మూసుకుపోయింది. దీంతో విమ్స్ గేటు వరకు మురుగు నీటితోపాటు చెత్త పేరుకుపోయింది. ఇక్కడ బ్రిడ్జి(గేటు ద్వారా విమ్స్‌కు వెళ్లే మార్గం)కు ఇరుపక్కలా గెడ్డలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఈ చెత్త, మురుగు నీటిలో కుళ్లిపోవడంతో దుర్గంధం వస్తోంది. విమ్స్‌కు వెళ్తున్న రోగులు, వారి బంధువులు, విమ్స్ సిబ్బంది ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు మూడు నెలలుగా జరుగుతున్న పనుల కారణంగా ఇక్కడ రోజూ చెత్త పేరుకుపోతున్నా.. ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమ్స్ రోగులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

అన్నమాచార్య సంకీర్తనలతో శ్రీనివాసుని కటాక్షం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తనా పోటీలు నిర్వహించారు. కప్పరాడ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తితో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని కటాక్షం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు భక్తిని కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఐదు విభాగాల్లో జరిగిన పోటీలో నగరానికి చెందిన 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథి వంకాయల సన్యాసిరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కె.ఎ.రాజు, అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కన్వీనర్ సి.హెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్ రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్, అరుణకాంత్ పాల్గొన్నారు.